మెయిన్
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 8
సంచిక : 10
పేజీలు : 3
శుక్రవారం 25 జులై, 2025
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## మంత్రి పొంగులేటి కి కృతజ్ఞతలు

• టి మీడియా (డిజిటల్ )కుటుంబం

**టి మీడియా,జూలై 24,ఖమ్మం:**

అక్రీడేషన్‌ల విధివిధానాలు గురించి 3 రోజుల్లో సమావేశం జరువుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పటం పట్ల టి మీడియా కుటుంబం తరుపున శనగపాటి మురళీ కృష్ణ హర్షం వ్యక్తం చేసారు. ఇళ్ల స్థలాలు విషయం కోర్టు పరిధి లో ఉంది ఏమి చేయలేము అని స్పష్టత ఇవ్వడం పట్ల మంత్రికి కృతజ్ఞత తెలియ చేస్తున్నము. సమావేశం ఏ సంఘాలు, ఎవరు అన్నది ముందస్తుగా వెల్లడి చేయాలని, విలేకరులను గుర్తింపు విధివిదానాలు కోసం వేసిన కమిటీ ఏమి నివేదిక ఇచ్చింది కూడా జర్నలిస్టు సమాజం లో చర్చ కు పెట్టాలని కోరారు.కేంద్ర ప్రభుత్వ 2021 డిజిట గైడ్ లైన్స్ కు అనుగుణంగా రాష్టం లో డిజిటల్ మీడియాకి గుర్తింపు గురించి,ప్రింట్ అనుమతులు ఉండి పిడి ఎఫ్ లు,ఈ పేపర్ లు నడిపే వారిపై తీసుకొనే చర్యలు గురించి మంత్రి స్పష్టత ఇచ్చి సమావేశం పెడితే మంచిదని సూచన చేసారు.ఈ మేరకు మంత్రి పొంగులేటిని కల్సి టి మీడియా కుటుంబం నుండి వినతి ఇస్తామని అన్నారు.

ఇప్పటికే పొంగులేటి హైద్రాబాద్ కార్యాలయంకు పోస్ట్ ద్వారా లేఖ పంపామని మురళీకృష్ణ తెలిపారు. ఏ మీడియాలో పని చేయని కొంతమంది సంఘం,నాయకులుగా చలామణి అవునుతున్నరని అటువంటి వారిని దూరం పెట్టాలని కోరారు. ఏది ఏమైనా అక్రీడేషన్ లు, ఇళ్ల స్థలాలు విషయంలో స్పష్టత ఇచ్చిన మంత్రికి ధన్యవాదాలు అన్నారు.

### యూకే-భారత్

# వాణిజ్య ఒప్పందం





• వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిపై నో ట్యాక్స్
• ఏపీ, కేరళ, తమిళనాడుకు ప్రయోజనాలు

**టి మీడియా, జులై24,ఢిల్లీ బ్యూరో :**

#### ఈ పంటలపై సుంకాల్లేవ్

ఒప్పందం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పసుపు, మిరియాలు, యాలకులు, మామిడి గుజ్జు, పచ్చళ్లు, పప్పులు వంటి వాటిపై ఇక నుంచి యూకే సుంకాలు విధించదు. దీనివల్ల ఆయా ఉత్పత్తులపై భారత రైతులు, ఎగుమతి వ్యాపారులకు ఆకర్షణీయ లాభాలు లభిస్తాయి. ఈ విభాగాల్లో వీలైనంత మేర ఎగుమతులను పెంచుకొని, లాభాలను పెంచుకునే అవకాశం దక్కుతుంది.

#### పెద్ద మార్కెట్, భారీ ప్రయోజనం

భారత్‌కు చెందిన దాదాపు 95 శాతానికిపైగా వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తులపై ఇకపై ఎలాంటి సుంకాన్ని యూకే విధించదు. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, పచ్చళ్లు, మసాలా పొడులు, పండ్ల గుజ్జులు, రెడీ టు ఈట్ మీల్స్, ప్రాసెస్ చేసిన ఫుడ్స్ వంటివన్నీ ఈ కేటగిరిలోకి వస్తాయి. పన్నులు లేకపోవడంతో, వీటిని యూకేకు ఎగుమతి చేసే ఖర్చు తగ్గిపోతుంది. ఫలితంగా వీలైనంత తక్కువ రేటుకే వాటిని యూకే మార్కెట్‌లో విక్రయించే అవకాశం కలుగుతుంది. తద్వారా యూకే వ్యాపారులు, రిటైల్ చైన్ల నుంచి భారత్‌కు ఆర్డర్లు పెరిగిపోతాయి. ఈ మార్పు భారత్‌లో వ్యవసాయ రంగానికి దన్నుగా నిలుస్తుంది. గ్రామీణ స్థాయిలో ఎంతోమందికి కొత్తగా ఉపాధి అవకాశాలు ఏర్పడుతాయి.

#### ఒప్పందం నుంచి మినహాయింపు

యూకేతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే క్రమంలో భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. భారత రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం పలు ఉత్పత్తులను ఈ డీల్ నుంచి మినహాయించింది. అంటే వాటిపై ఇకపైనా ఇరుదేశాలు పరస్పరం పన్నులను విధించుకోవచ్చు. ఈ జాబితాలో డైరీ ఉత్పత్తులు, యాపిల్స్, ఓట్స్, వంట నూనెలు వంటివి ఉన్నాయి. వీటిపై పన్నుల విధింపు విషయంలో ఎలాంటి మినహాయింపులూ ఉండవు. దేశంలో ఆహార భద్రత, ధరల నియంత్రణ, రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఈ వ్యూహాన్ని భారత్ అనుసరించింది. ఉదాహరణకు భారత్ నుంచి యూకేకు యాపిల్స్ ఎగుమతి అవుతుంటాయి. వీటిపై పన్నులను కొనసాగించడం వల్ల భారత ప్రభుత్వానికి ఏటా నిర్దిష్ట ఆదాయం లభిస్తుంది. యాపిల్స్‌పై ఎగుమతి సుంకాన్ని ఎత్తేస్తే, ప్రభుత్వానికి ఇక ఆదాయం రాదు. దీంతోపాటు భారత్‌లో యాపిల్స్ కొరత ఏర్పడి, ధరలు పెరిగిపోతాయి. దీనివల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుంది. ఇలాంటి ప్రతికూల పరిణామాలు జరగకూడదనే ఉద్దేశంతో పలు వ్యవసాయ ఉత్పత్తులను స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నుంచి భారత్ మినహాయించింది.

#### 100 బిలియన్ డాలర్ల లక్ష్యం సాకారం

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల భారత్ నుంచి యూకేకు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పెరుగుతాయి. 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల వ్యవసాయ ఎగుమతులు చేయాలనే భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఈ డీల్ బాటలు వేస్తుంది. పన్నులు లేకపోవడంతో, రాబోయే మూడేళ్లలో యూకేకు భారత వ్యవసాయ ఎగుమతులు దాదాపు 20 శాతం మేర పెరిగే అవకాశం ఉంది.

#### సర్టిఫికేషన్ ఇక ఈజీ

ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత భారత వ్యవసాయ ఉత్పత్తులకు ఇక నుంచి ఈజీగా యూకే మార్కెట్‌లోకి ఎంట్రీ లభిస్తుంది. ఆయా వ్యవసాయ ఉత్పత్తుల సర్టిఫికేషన్‌లతో ముడిపడిన నిబంధనలను సరళతరం చేశారు. దీనివల్ల యూకేకు చేరాక వాటి తనిఖీ సమయం తగ్గిపోతుంది. పన్నులు లేకపోవడంతో ఎగుమతి వ్యయం దిగి వస్తుంది.

#### సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులకు భలే గిరాకీ

పనస పండు, మిల్లెట్లు, కూరగాయలతో పాటు సేంద్రీయ పద్ధతుల్లో పండించిన పసుపు, మిరియాలు, అల్లం, కొత్తిమీర, మెంతికూర, జీలకర్ర, దాల్చిన చెక్క, లవంగాలు, జాజికాయలకు యూకేలో భారీ డిమాండ్ ఉంది. వీటిని పండించే భారతీయ రైతులకు ఇక మంచి రోజులు మొదలైనట్టే. నిర్ణీత స్టాక్‌ను నిర్వహిస్తూ, యూకేకు వీటిని ఎగుమతి చేసి రైతులు, ఎగుమతి వ్యాపారులు లాభాలను గడించొచ్చు. దేశీయ మార్కెట్‌లో వీటి ధరలు తక్కువగా ఉన్నప్పుడు, యూకేకు ఎగుమతి చేసి లాభాలను అందుకోవచ్చు.

భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ డీల్?తో అసోం పర్వత ప్రాంతాల నుంచి ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల దాకా, పంజాబ్ పొలాల నుంచి కేరళ మసాలా క్షేత్రాల వరకు యావత్తు భారత రైతులకు భారీ ప్రయోజనం కలగనుంది. ఈ ఒప్పందం వల్ల వ్యవసాయ రంగానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరనున్నాయి? పన్ను రహితంగా యూకేకు ఎగుమతి చేసుకునే అవకాశం ఉన్న వ్యవసాయ ఉత్పత్తులు ఏవి? ఈ డీల్ ద్వారా ఏపీ, ఒడిశా, కేరళ, తమిళనాడులోని 'ఫిషరీస్'కు ఎగుమతులకు ఉన్న అపార అవకాశాలను ఏంటి?కీలకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై భారత్, యూకే చర్చలు 2025 మే 6న కొలిక్కి వచ్చాయి. ఇక ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని ఆనాడే ఇరుదేశాలు అంగీకారానికి వచ్చాయి. గురువారం రోజు (జులై 24న) ఈ ఒప్పందంపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో సరళతరమైన వాణిజ్య విధానాలతో ఇరుదేశాలు పరస్పరం ఎగుమతి, దిగుమతులను ప్రోత్సహించనున్నాయి. ఈ డీల్? దేశీయ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు రెక్కలు తొడుగుతుందని భారత్ భావిస్తోంది. ఈ డీల్‌తో ప్రధానంగా భారత్‌లోని చిన్న, సన్నకారు రైతులకు లబ్ధి చేకూరుతుందని పరిశీలకులు అంటున్నారు. పన్నుల బాధ లేకుండా వ్యవసాయ ఉత్పత్తులను యూకేకు ఎగుమతి చేసేందుకు భారత్‌కు అవకాశం లభిస్తుంది. దీనివల్ల భారతీయ రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మెరుగైన రేట్లు దక్కుతాయి. నాణ్యతతో పాటు నిల్వకాలం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలు, ధాన్యాలను పండించే అన్నదాతలకు లాభాలు పండుతాయి. రసాయనాలు, క్రిమి సంహారకాలు లేకుండా, సంప్రదాయక పద్ధతులతో పండించే పంటలకు యూకే మార్కెట్‌లో ఆకర్షణీయమైన రేట్లు లభిస్తాయి. ఈ గొప్ప అవకాశాన్ని భారతీయ రైతులు, ఎగుమతిదారులు అందిపుచ్చుకోవచ్చు. ఇప్పటికే పలు ఈయూ దేశాలు, జర్మనీ, నెదర్లాండ్స్‌కు వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసి భారత వ్యాపారులు మంచి లాభాలను గడిస్తున్నారు. ఈ జాబితాలో ఇక నుంచి యూకే కూడా చేరనుంది.

#### ఫిషరీస్ రంగానికి అవకాశాలు

ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని ఫిషరీస్ రంగానికి మంచి రోజులు మొదలైనట్టే. విదేశాల నుంచి యూకే ఏటా 5.4 బిలియన్ డాలర్ల విలువైన సముద్ర ఆహారాన్ని దిగుమతి చేసుకుంటుంది. ప్రస్తుతం ఇందులో భారత్ ఎగుమతుల వాటా కేవలం 2.25 శాతమే. ఈ పెద్ద మార్కెట్‌లో ఇకపై పన్నులు లేకుండా, వ్యాపారాన్ని మరింతగా పెంచుకునే ఛాన్స్ భారత ఫిషరీస్ రంగానికి దక్కనుంది. ఇప్పటివరకు భారత్ నుంచి దిగుమతి చేసుకునే రొయ్యలు, ట్యూనా చేపలపై యూకే 4.2 శాతం నుంచి 8.5 శాతం దాకా సుంకాలు విధించేది. ఇకపై ఈ ఉత్పత్తులపై సుంకాలేం ఉండవు. చేపలు, రొయ్యలు, కోళ్లకు దాణాగా వేసే ఫిష్ మీల్ పౌడర్‌పైనా ఇక నుంచి యూకే ట్యాక్స్ విధించదు. వీటి ఎగుమతులను పెంచుకొని రైతులు, వ్యాపారులు లాభపడొచ్చు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలోని శానిటరీ అండ్ ఫైటో శానిటరీ ప్రమాణాలను పాటించి, తిరస్కరణకు అవకాశం ఇవ్వకుండా చాలా సులభంగా యూకేకు ఈ ఉత్పత్తులను ఎగుమతి చేయొచ్చు.

#### కాఫీ, ఇన్‌స్టాంట్ కాఫీ

ఏటా విదేశాల నుంచి యూకే దిగుమతి చేసుకుంటున్న కాఫీలో 1.7 శాతం వాటా భారత్‌దే. ఈ ఎగుమతుల విభాగంలో నంబర్ 1, నంబర్ 2 స్థానాల్లో ఉన్న జర్మనీ, స్పెయిన్ దేశాలతో పోటీపడే అవకాశం భారత్‌కు లభించబోతోంది. ప్రీమియం రకం కాఫీ, ఇన్‌స్టాంట్ కాఫీలకు యూకేలో మంచి ఆదరణ ఉంది. పన్నులు లేకపోవడాన్ని ఆసరాగా చేసుకొని, ఈ మార్కెట్‌పై పట్టు సాధించే అవకాశం భారత కాఫీ రైతులకు లభించబోతోంది.

#### టీ, సుగంధ ద్రవ్యాలు

ఏటా భారత్ నుంచి జరిగే టీ ఎగుమతుల్లో 5.6 శాతం, సుగంధ ద్రవ్యాల ఎగుమతుల్లో 2.9 శాతం వాటా యూకేదే. ఇకపై ఈ రెండు కేటగిరీలపై పన్నులేం లేవు. నాణ్యమైన టీ, సుగంధ ద్రవ్యాలను పండించే రైతులకు ఇది గొప్ప ఛాన్స్. దీన్ని అందిపుచ్చుకుంటే మన దేశంలోని వివిధ రాష్ట్రాల రైతుల ఆర్థిక స్థితిగతులు చాలా మెరుగుపడుతాయి.

#### నూనె విత్తనాలు

సోయాబీన్, పల్లీలు, పత్తి విత్తనాలు, ఆవాలు, నువ్వులు, పొద్దుతిరుగుడు విత్తనాల నుంచి నూనెను తీస్తారు. వీటిపైనా ఇక నుంచి పన్నులేం ఉండవు. రైతులు ఈ విత్తనాలను యూకేకు ఎగుమతి చేసి రాబడులు పెంచుకోవచ్చు.

#### ఆ డ్రింక్స్‌కు డిమాండ్

గోవాలో తయారయ్యే ఫెనీ డ్రింక్, నాసిక్‌లో ఖ్యాతిగాంచిన వైన్స్, కేరళ కల్లులకు ప్రస్తుతం జాగ్రఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగ్ ఉంది. వీటి నిల్వ కాలం కూడా ఎక్కువే. అందుకే ఈ డ్రింక్స్‌కు యూకే రిటైల్ చైన్లు, హోటల్ చైన్ల నుంచి ఆర్డర్స్ లభిస్తుంటాయి. ఈ డ్రింక్స్ తయారు చేసేవారు యూకేకు ఎగుమతులను పెంచుకోవచ్చు. పన్నులు లేనందున వారి లాభాలు పెరుగుతాయి.

---

### తెలంగాణ సర్వే దేశానికి

# ఆదర్శం కావాలి



#### ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

**టి మీడియా, జులై24,ఢిల్లీ:**


తెలంగాణలో శాస్త్రీయంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే దేశానికి ఆదర్శం కావాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉద్ఘాటించారు. తెలంగాణ సర్వే ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యాసంస్థల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సిఫారసు చేస్తోందని తెలిపారు. బీసీ బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తోందని వెల్లడించారు. ఈ చారిత్రాత్మక ప్రయత్నంలో కృషి చేసిన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలోని బృందానికి కృతజ్ఞతలు తెలిపారు మల్లికార్జున ఖర్గే.కాంగ్రెస్ అధ్యక్షుడు, తెలంగాణ సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రిమండలి, ఎంపీలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మల్లికార్జున ఖర్గే పోస్ట్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ సామాజిక న్యాయం 2.0 ఉద్యమాన్ని ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. బలహీన వర్గాల కోసమే ఈ న్యాయ పోరాటమని నొక్కిచెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిరంతర పోరాటం చేస్తోందని ఉద్ఘాటించారు. దశాబ్దాలుగా పక్కకు నెట్టివేయబడిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల ప్రజల గళంగా కాంగ్రెస్ పనిచేస్తోందని స్పష్టం చేశారు మల్లికార్జున ఖర్గే.దేశ జనాభాలో మెజార్టీ సంఖ్య అయినా కార్పొరేట్ బోర్డులు, న్యాయవ్యవస్థ, బ్యూరోక్రసీ, ఉన్నత విద్యాసంస్థల్లో వర్ణహీనత కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో కూడా అన్యాయం జరుగుతోందని.. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించారని గుర్తుచేశారు. 80 శాతం ఓబీసీ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. అలాగే 83 శాతం ఎస్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా జాతీయ కుల గణాంకాల సమీక్ష జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల ఒత్తిడికి లోనై కులగణనకు మోదీ ప్రభుత్వం అంగీకారం తెలిపిందని... కానీ 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఎందుకు తొలగించ లేదని మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు.

### రుజువు ఉంది తప్పించుకోలేరు

#### ఈసీకి రాహుల్ వార్నింగ్?

**టి మీడియా, జులై24,ఢిల్లీ :**

లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఎన్నికల కమిషన్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం ఓట్లను దొంగిలిస్తోందని విమర్శించారు. కర్ణాటకలోని ఓ నియోజకవర్గంలో ఎన్నికల సంఘం మోసానికి అనుమతించిందని తమ? వద్ద 100శాతం కచ్చితమైన రుజువు ఉందని రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు. అయితే ఈసీ తమ నుంచి తప్పించుకోలేదని, వారి వెంట తాము పడతామని వార్నింగ్ ఇచ్చారు. ఎన్నికల సంఘం తన విధులను సరిగ్గా నిర్వహించడం లేదని విమర్శించారు. బిహార్?లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ నేపథ్యంలో ఎన్నికలను బహిష్కరించాలంటూ ఆర్జేడీ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు.ఎన్నికల సంఘానికి ఒక సందేశం పంపాలని అనుకుంటున్నాను. దీని నుంచి తప్పించుకోగలమని మీరు, మీ అధికారులు భావిస్తే పొరపాటు పడినట్లే. మీరు దీని నుంచి తప్పించుకోలేరు. ఎందుకంటే మేము వెంటాడుతూనే ఉంటాం. పరిశీలించిన ఒక్క నియోజక వర్గంలోనే మేము మోసాన్ని గుర్తించాం. మిగిలిన చోట్ల కూడా ఇటువంటి డ్రామానే నడుస్తోంది. మేము పరిశీలించిన నియోజకవర్గంలో కొత్తగా వేలాది మంది ఓటర్లు వచ్చారు. వారి వయస్సులు 45, 50, 60, 65లుగా ఉన్నాయి. దీని నుంచి ఎన్నికల కమిషన్, సంబంధిత అధికారులు తప్పించుకుంటామని భావిస్తే పొరపడ్డట్లే. తప్పకుండా వారికోసం మేము వస్తాం"



#### రాహుల్ గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత

మరోవైపు బిహార్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం సమర్థించుకుంది. ఓటర్లను తొలగిస్తున్నారనే విపక్షాల ఆరోపణలను తోసిపుచ్చింది. ఓటరు జాబితా సవరణపై కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారని ఈసీ ప్రధాన కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. చనిపోయినవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారి పేరుతో నకిలీ ఓటర్లను ఎలా అనుమతిస్తామని ఆయన ప్రశ్నించారు. బిహార్ ఎన్నికలకు ముందు ఈసీ, కేంద్రప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఓటరు జాబితా సవరణ చేపట్టాయని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో సీఈసీ ఈమేరకు స్పందించారు. బిహార్ ఓటరు జాబితా నుంచి 56 లక్షల ఓటర్లను తొలగించాలని గుర్తించినట్లు ఆయన చెప్పారు. అందులో 20లక్షలు చనిపోయినవారు, 28లక్షలు శాశ్వతంగా వలస వెళ్లినవారు, మరో 7లక్షల మంది ఒకటి కంటే ఎక్కువచోట్ల ఓటర్లుగా నమోదయ్యారని, లక్షమంది లెక్కలో లేని ఓటర్లని ఈసీ జాబితా వెల్లడించింది. మరో 15లక్షల మంది ఓటర్ సవరణ ఫామ్ తిరిగి సమర్పించలేదని ఈసీ పేర్కొంది.

**టి మీడియా, జులై 24, ఢిల్లీ:**

రష్యాకు చెందిన AN-24 విమానం రాడార్ నుంచి సంబంధాలు తెగిపోయి చైనా సరిహద్దుల్లోని తూర్పు ప్రాంతంలో కూలిపోయింది. ప్రమాద సమయంలో విమానంలో దాదాపు 49 మంది వరకు ప్రయాణికులు ఉన్నారని తెలుస్తోంది. తొలుత విమానం అదృశ్యమైనట్లు వార్తలు రాగా, కాసేపటి క్రితమే కూలిపోయిందని అధికారులు నిర్ధరించారు.రష్యన్ వార్తా కథనాల ప్రకారం, గురువారం తెల్లవారుజామున 49 మంది ప్రయాణికులతో వెళ్తున్న రష్యా విమానం తొలుత అదృశ్యమయ్యింది. సైబీరియా చెందిన అంగారా ఎయిర్‌లైన్స్ AN-24 విమానం బ్లాగోవెష్‌చెన్స్క్ నుంచి చైనా సరిహద్దుల్లో ఉన్న టిండా ప్రాంతానికి బయల్దేరింది. మరికొద్దిసేపట్లో ల్యాండింగ్ అయ్యే సమయానికి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లతో విమనానికి సంబంధాలు తెగిపోయాయి. దీంతో అప్రమత్తమైన యంత్రాంగం వెంటనే ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టింది. అదృశ్యమైన కొద్దిసేపటికే రష్యా అత్యవసర పరిస్థితుల మంత్రిత్వ శాఖ విమానం "కాలిపోతున్న ఫ్యూజ్‌లేజ్"ను కనుగొన్నట్లు తెలిపింది. అయితే ఆ విమానం ల్యాండ్ అయ్యేందుకు 15 కిలోమీటర్ల దూరంలో ఉండగా కూలిపోయినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

#### సహాయక చర్యల్లో పాల్గొన్న రెస్క్యూ సిబ్బంది

చైనా సరిహద్దుల్లోని టిండా విమానాశ్రయానికి చేరువలోనే విమాన ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో విమానంలో ఐదుగురు పిల్లలు, ఆరుగురు సిబ్బందితో సహా 43 మంది ప్రమాణికులు ఉన్నారని రష్యన్ మీడియా కథనాలు తెలిపాయి. సహాయ చర్యల కోసం ప్రత్యేక దళాలను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. కాగా, ఘటనాస్థలంలో భారీగా మంటలు చెలరేగాయి. రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. విమానం తొలుత ల్యాండింగ్‌కు ప్రయత్నించగా అది విఫలం కాగా, మరోసారి ల్యాండింగ్ చేసేటపుడు ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది.కాగా ఈ ప్రమాదంలో ఎవరూ బతికే అవకాశం లేదని రష్యా వార్తా కథనం ఒకటి ప్రకటించింది. ఘటనాస్థలిలో విమాన శకలాలకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. పైలట్ తప్పిందం, ల్యాండింగ్ సమయంలో వాతావరణం అనుకూలించకపోవడమే ప్రమాదానికి కారణం కావచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత సంవత్సరం సెప్టెంబర్‌లో, ముగ్గురు వ్యక్తులతో వెళ్తున్న రాబిన్సన్ 66 హెలికాప్టర్ ఇదే అమూర్ ప్రాంతంలో అదృశ్యమైంది. ఈ ప్రాంతం మాస్కోకు తూర్పున దాదాపు 6,600 కి.మీ దూరంలో ఉంది.

# కుప్పకూలిన విమానం

### 49 మంది మృతి



### అనిల్ అంబానీ కంపెనీల్లో
# ఈడీ సోదాలు
ఎస్‌బీఐ ఫ్రాడ్ ప్రకటించిన రెండు రోజుల్లోనే

3లో..

### బంగాళాఖాతంలో అల్పపీడనం
# ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలు
అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన సీఎం

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**టీ మీడియా, జులై 24, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లాలోని అన్ని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో, వసతి గృహాల్లో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్ర వాతావరణం కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపల్స్ తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్న నేపథ్యంలో అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో పరిశుభ్రత వాతావరణం కల్పించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి పరిసరాలను శుభ్రం చేయించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా నిల్వ నీరు, పాత టైర్లు, కుండలు ఏవైనా ఉంటే వాటిని తీసివేయాలన్నారు. అదేవిధంగా పాఠశాలల, వసతి గృహాల ఆవరణలో పిచ్చి మొక్కలు ఉంటే క్లీనింగ్ చేయించాలని చెప్పారు. అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల, వసతి గృహాల్లో వంట చేసే వారికి టైఫాయిడ్ వైడల్ టెస్ట్ చేయించాలని, ఇందుకోసం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది క్యాంపస్ లకి వస్తారని వారికి సహకరించాలని చెప్పారు. ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలలో సిక్ రూమ్ ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యేక అధికారులు వారానికి ఒకసారి రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించి పరిశుభ్రతను పర్యవేక్షించాలన్నారు. ప్రతి హాస్టల్లో భోజనాన్ని నాణ్యతను పరిశీలించేందుకు ఒక సూపర్వైజర్ ఉండాలని లేకపోతే నియామకం చేయాలని, ఈ బాధ్యత ఆయా రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపల్స్ పైనే ఉందని చెప్పారు. అదేవిధంగా ప్రతి పాఠశాలలో మెస్ కమిటీలు ఉండాలని, తప్పనిసరిగా కమిటీలకు చెందిన విద్యార్థుల సంతకాలు స్టాక్ రిజిస్టర్ లో ఉండాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు వినియోగించే బియ్యం, ఇతర పదార్థాలు నాణ్యమైన వైతేనే వినియోగించాలని లేదంటే రిటర్న్ పంపించాలని ఆదేశించారు. ఎక్కడైనా ఫుడ్ పాయిజన్ కేసులు నమోదు అయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. విద్యార్థులు తప్పనిసరిగా చేతులు పరిశుభ్రంగా కడుక్కున్న తర్వాతనే భోజనం చేసేలా వారికి సబ్బు అందుబాటులో ఉంచాలని అవగాహన కల్పించాలని సూచించారు.

**వన మహోత్సవం లక్ష్యాలను సాధించాలి**

జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని స్కూల్స్, కాలేజ్ లు పబ్లిక్ ప్లేసెస్ లో మొరింగా (మునగ) సహా ఇతర న్యూట్రిషన్ మొక్కలు నాటాలని ఆదేశించారు. ప్రతి గ్రామానికి ఊరికి రెండు చివర్ల రహదారికి ఇరువైపులా మొక్కలు నాటాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అనర్హులకు లబ్ధిదారుల జాబితాలో చోటు ఇవ్వవద్దని, అలాంటి ఘటనలు దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అదేవిధంగా ఇళ్ల నిర్మాణంలో గ్రౌండ్ చేయడం వేగవంతం చేయాలని ఆదేశించారు.

తాగునీటికి సంబంధించి గ్రామాల్లో పరిశుభ్రమైన తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా క్లీన్ చేసి ఉంచుకోవాలని, ట్యాంకుల వద్ద క్లీనింగ్ రిజిస్టర్ పెట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా డెంగ్యూ కేసులు వస్తే జాగ్రత్తలు తీసుకొని ఇతరులకు వ్యాప్తి చెందకుండా సంబంధిత ఏరియాలో అప్రమత్తమై జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, డిఆర్డిఓ ఉమాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## జిల్లా మహా సభలు విజయవంతం

- ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు

**టీ మీడియా, జులై 24, వనపర్తి బ్యూరో :**
టియుడబ్ల్యూజే(ఐజేయు ) జిల్లా తృతీయ మహాసభను విజయవంతం చేయడానికి కృషి చేసిన జర్నలిస్ట్ లు అందరికి నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాధవరావు, బి. రాజు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సభ నిర్వహణకు పూర్తి స్థాయిలో సహకారం అందించిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి కృతజ్ఞతలు. మహా సభలకు సహకరించడం తో పాటు వనపర్తి నియోజక వర్గ జర్నలిస్ట్ లకు వరాలు కురిపించడం సంతోషకరం అని అన్నారు. నూతనంగా ఏర్పాటు అయిన జిల్లా కార్యవర్గం నిరంతరం జర్నలిస్ట్ ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ద్యారపోగు మన్యం, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, నర్సింహా రాజు, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు విజయ్, బాలరాజు, టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ రాజ్, సిల్ మార్తి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

**టీ మీడియా, జులై 24 ,ఆత్మకూర్:**



భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి వర్యులు కేటీఆర్ గారి పుట్టినరోజు సందర్భంగా మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అదేశానుసరంగా బి.ఆర్.యెస్ పార్టీ మండల అధ్యక్షులు రవి కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆత్మకూరు మండలంలోని స్థానిక గెస్ట్ హౌస్ లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియచేసిన ఆత్మకూరు మండల మరియు మున్సిపల్ బి.ఆర్.యెస్ నాయకులు కార్యకర్తలు.

## పేషెంట్లకు బ్రెడ్,పండ్లు పంపిణి

**టీ మీడియా,జులై 24,గోదావరిఖని :**



బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పుట్టినరోజు ను ఘనంగా నిర్వహించారు.బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్,ఆదేశానుసారం కోలేటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావు పుట్టినరోజు సందర్భంగా గురువారం గోదావరిఖని జనరల్ హాస్పిటల్ లో బి ఆర్ఎస్ యూత్ లీడర్ పల్లె రమేష్ నేతృత్వంలో పేషెంట్లకు బ్రెడ్,పండ్లు పంపిణీ చేయడంజరిగింది. ఈకార్యక్రమంలో సుమన్,సాయి, సూరజ్, అంజి, సాగర్,సాయి, ప్రకాష్, చరణ్,సాజీద్,అజయ్,సిద్ధూ, కార్తీక్, పవన్, దినేష్, బాలాజీ, సాత్విక్ రిషి, శివ, అఖిల్,ప్రభాకర్, చందు, హేమంత్, శీను,నరేష్,తదితరులు పాల్గొనడం జరిగింది.

## కేటీఆర్‌కి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

**టీ మీడియా, జూలై 24, మేడ్చల్:**




ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ , ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పుష్పగుచ్చం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## బాలుర వసతి గృహం ఆకస్మిక తనిఖీ

**టీ మీడియా, జులై 24, వనపర్తి బ్యూరో :**



గురువారం మధ్యాహ్నం వనపర్తి ప్రభుత్వ ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహం (బి)లో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ (డీఎంహెచ్ఎ) ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కిచెన్, స్టోర్ రూమ్, గదులు, బాత్రూం, టాయిలెట్లు, వాషింగ్ జోన్లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ అమలు, వసతులపై ఫీడ్బ్యాక్ తీసుకున్నారు. శుభ్రతపై సిబ్బందికి సూచనలు చేశారు. వసతి గృహ అధికారుల వినతులపై సానుకూలంగా స్పందించారు.



## కేటీఆర్ జన్మదిన సందర్భంగా పూజలు

**టీ మీడియా, జులై 24, రామకృష్ణాపూర్:**
క్యాతనపల్లి మున్సిపాలిటీ బొక్కలగుట్టలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామరావు (కేటీఆర్) జన్మదిన సందర్భంగా గురువారం గాంధారి మైసమ్మ ఆలయంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన చెన్నూర్ ఇంచార్జ్ డాక్టర్ రాజారమేష్ మాట్లాడుతూ ముందుగా కేటీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కేటీఆర్ ప్రజల మనిషి అని,తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పోరాడే వ్యక్తి అని ,కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్ధ పాలన పై నిరంతరం ప్రశ్నించే నాయకుడు కేటీఆర్ అని ,ప్రజా గొంతుకను వినిపించడానికి కేటీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు.అలాగే ఆర్కెపి బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కూడా కేటీఆర్ జన్మదిన సందర్భంగా కార్యకర్తలు ఘనంగా కేక్ కట్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పారుపల్లి తిరుపతి, అలుగుల శ్రీలత ,సత్యం,మాజీ ఎంపీటీసీ గురువయ్య,పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్ గౌడ్,రామిడి కుమార్,పోగుల మల్లయ్య, యువ నాయకులు నస్పూరి శివ, దేవి సాయికృష్ణ, దినేష్, మణి, లలిత, మామిడి లక్ష్మి కాంత్, తదితరులు పాల్గొన్నారు.

## వినతిపత్రం అందజేసిన యుటిఎఫ్

**టీ మీడియా, జులై 24, వనపర్తి బ్యూరో :**



ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికై , ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి పిలుపునిచ్చిన నేపథ్యంలో టీఎస్ యుటిఎఫ్ శ్రీరంగాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో శ్రీరంగాపూర్ డిప్యూటీ తహసిల్దార్ కి వినతిపత్రం అందజేసిన మండల అధ్యక్షుడు కురుమన్న, ఉపాధ్యక్షుడు రమేష్, జిల్లా కోశాధికారి తిమ్మప్ప, మండల కోశాధికారి శ్రావణ్ కుమార్, ఉపాధ్యాయులు నాగరాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మారనున్న భూముల ధరలు

- 5 గ్రామాల్లో త్వరలో నక్షా మ్యాప్‌లు

**టి మీడియా,జూలై 24,హైదరాబాద్ బ్యూరో :**



రాష్ట్రంలో భూముల ధరల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే గుడ్?న్యూస్? చెప్పే అవకాశం ఉంది. ఎందుకంటే భూముల మార్కెట్? విలువను సవరించే అంశంపై సమాలోచనలు చేస్తోంది. కొన్ని ప్రాంతాల్లో తగ్గించడంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో పెంచాలన్న ప్రతిపాదనలను పరిశీలిస్తోంది. ఈ క్రమంలోనే లావాదేవీలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల్లో భూముల మార్కెట్? విలువలను ముందుగా సవరించాలని చూస్తోంది. ఔటర్? రింగ్? రోడ్డు లోపల కొంతమేరకు పెంచితే ఎలా ఉంటుందని ఇటీవల రిజిస్ట్రేషన్లు, స్టాంపుల విభాగం నుంచి ప్రతిపాదనలు తీసుకుంది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా వివిధ సబ్?-రిజిస్ట్రార్ల పరిధిలోని భూముల విలువల పెంపు ప్రతిపాదనలనూ పరిశీలిస్తోంది.ఇప్పటికిప్పుడు విలువలను పెంచకున్నా సీఎం దృష్టికి తీసుకెళ్లి, మంత్రిమండలిలో చర్చించి తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ పెంచితే హెచ్?ఎండీఏ పరిధిలో తీసుకోవాలా? లేక ఔటర్? రింగ్? రోడ్డు పరిధిలోని భూముల విలువలను పరిశీలించాలా? లేదా హైదరాబాద్? చుట్టూ ఉన్న భూముల విలువలను మదింపు చేయాలా? అనే అంశాలను పరిశీలిస్తున్నారు. ఒకవేళ పెంచితే ఎంత శాతం పెంచాలి? ఒకవేళ తగ్గిస్తే ఏ స్థాయిలో తగ్గించాలన్న విషయాలను మంత్రిమండలి సమావేశంలో చర్చించి ముందుకెళ్లాలని ప్రభుత్వం యోచనలో ఉంది. గతంలో రెండుసార్లు ఇష్టానుసారం భూముల విలువలు పెంచారని భావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల పెరిగిన భూముల బహిరంగ ధరలను పరిగణనలోకి తీసుకుని మార్కెట్? విలువల్లో సవరణలు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులకు సూచించినట్లు తెలిసింది. భూముల మార్కెట్? విలువ సవరణపై ఆయన బుధవారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. అధికారులు ఇటీవల ప్రతిపాదించిన సవరణలపై మరోమారు అధ్యయనం చేసి, తాజా ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.ఆ ఐదు గ్రామాల్లో త్వరలో నక్షా మ్యాపులు : రాష్ట్రంలో నక్షా లేని 413 గ్రామాలకు గానూ ఐదు గ్రామాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన రీసర్వే విజయవంతంగా పూర్తి అయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. త్వరలోనే ఆయా గ్రామాలకు సర్వే బౌండరీ చట్టం ప్రకారం నక్షా మ్యాపులు సిద్ధం చేస్తామన్నారు. బుధవారం సచివాలయంలో సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి లోకేశ్? కుమార్?, సర్వే ల్యాండ్? సెటిల్?మెంట్? విభాగం కార్యదర్శి రాజీవ్? గాంధీ హనుమంతులతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు.నిజాంకాలం నుంచి 413 గ్రామాలకు నక్షాలు లేవు. గత సర్కారు పదేళ్లుగా ఈ గ్రామాలను గాలికి వదిలేసింది. ఈ సమస్యకు పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో ప్రయోగాత్మకంగా రీ-సర్వే చేపట్టామని అన్నారు. మహబూబ్?నగర్? జిల్లా గండీడ్? మండలం సలార్?నగర్?, జగిత్యాల జిల్లా భీర్పూర్? మండలం కొమ్మలాపల్లి, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ, ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని నూగురు, సంగారెడ్డి జిల్లా వట్?పల్లి మండలం షాహిద్?నగర్? గ్రామాల్లో డ్రోన్?/ఏరియల్? వ్యూ, ప్యూర్? గ్రౌండ్? ట్రూతింగ్? రోవర్? పద్ధతుల్లో సర్వే నిర్వహించామని చెప్పారు.ఈ నిబంధనల ప్రకారం భూ యజమానులకు నోటీసులు జారీ చేసి, గ్రామసభల ద్వారా యజమానుల అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. ప్రతి ఒక్కరి భూములకు సర్వే హద్దులు ఖరారు చేయాలని నిర్ణయించామని తెలిపారు. భూముల అమ్మకం, కొనుగోలు సమయంలో సర్వే మ్యాప్? కచ్చితంగా జత చేయడం, భూ భారతి చట్టం ప్రకారం భూములకు భూధార్? నంబర్? కేటాయింపును ఈ ఐదు గ్రామాల్లో అమలు చేయాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. ఐదు గుంటలకు పైగా ఉన్న భూములకు కొత్త సర్వే నంబర్లు ఇవ్వాలని ఆలోచిస్తున్నామని పేర్కొన్నారు. వక్ఫ్ భూములు ఉంటే వాటి వివరాలు నమోదు చేస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

- రేపు తెలంగాణ కేబినెట్ మీటింగ్

సచివాలయంలో సీఎం రేవంత్? రెడ్డి అధ్యక్షతన ఈ నెల 25న రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరగనుంది. కుల గణనపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల కమిటీ ఇటీవల ఇచ్చిన నివేదికను కేబినెట్?లో ప్రవేశపెట్టి చర్చించనున్నట్లు సమాచారం. గోశాల, కొత్తగా ప్రారంభించనున్న ప్రభుత్వ జూనియర్? కళాశాలలకు అవసరమైన పోస్టుల మంజూరు, ఈ నెల 25 నుంచి ఆగస్టు 10 వరకు రేషన్? కార్డుల పంపిణీకి సంబంధించిన మార్గదర్శకాలపై చర్చ, ఇందిరమ్మ ఇళ్లు, యూరియా లభ్యత, సాగునీటి ప్రాజెక్టుల అంచనాల పెంపుపై చర్చించనున్నట్లు తెలుస్తోంది.

## ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయాలి

**టీ మీడియా, జులై 24, వనపర్తి బ్యూరో :**



భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా వనపర్తి జిల్లా అధ్యక్షుడు మద్దిగట్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకి రైతుల సమస్యలు పైన వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎటువంటి ఆంక్షలు లేకుండా , కాంగ్రెస్ వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రకారము కాంగ్రెస్ ఎలక్షన్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రెండు లక్షల రుణమాఫీ ఇంతవరకు చాలామంది రైతులకు మాఫీ కాలేదు తక్షణమే మాఫీ చేయాలని అదేవిధంగా ఈ సీజన్లో చాలామంది రైతులకు రైతు భరోసా రాలేదు కావున , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఇట్టి విషయాన్ని దృష్టి సారించి వెంటనే రానటువంటి రైతులకు రైతు భరోసా వెయ్యాలి వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు ఇస్తానని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందో దాన్ని వెంటనే అమలు చేయాలి అదేవిధంగా కవులు రైతులకు రైతు భరోసా చెల్లించాలని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించి, తక్షణమే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి, అదేవిధంగా సబ్సిడీపై రైతులకు వ్యవసాయ యాంత్రిక పరికరాలు అందజేయాలని పళ్ళతోట రైతులను ఆదుకోవాలని వారన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబి రెడ్డి వెంకట్ రెడ్డి, బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, బిజెపి జిల్లా నాయకులు కొత్త కాపు మాధవ రెడ్డి, రామన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్,విష్ణువర్ధన్ రెడ్డి, వినోద్ గౌడ్, కోటేశ్వర్ రెడ్డి, వై కొండారెడ్డి, బిజెపి పెబ్బేర్ రూరల్ మండలాధ్యక్షుడు నాగరాజు యాదవ్, మాజీ మండల అధ్యక్షుడు కృష్ణ, కొత్తకోట మాజీ టౌన్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, అమర్నాథ్ జ్ఞానేశ్వర్ యాదవ్, సోషల్ మీడియా కన్వీనర్ నితిన్ పాల్గొన్నారు.

## అనిల్ అంబానీ కంపెనీల్లో ఈడీ సోదాలు

**ఎస్‌బీఐ ఫ్రాడ్ ప్రకటించిన రెండు రోజుల్లోనే**

**టి మీడియా, జులై24,ఢిల్లీ బ్యూరో :**




ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీని ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బీఐ 'ఫ్రాడ్' అని ప్రకటించిన రెండు రోజుల్లోనే ఆయనకు సంబంధించిన కంపెనీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోదాలు చేపట్టింది. గురువారం ఢిల్లీ, ముంబయిలోని అనీల్ అంబానికి సంబంధించిన సంస్థల్లో ఈడీ అధికారుల సోదాలు నిర్వహించారు. రూ.3 వేల కోట్ల రుణాలకు సంబంధించిన కేసులో అనీల్ అంబానీ కంపెనీల్లో పాటు ఎస్? బ్యాంకులోనూ సోదాలు చేపట్టింది. మనీలాండరింగ్ కేసులో భాగంగా 50 ప్రాంతాల్లో ఈడీ సోదాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఏకకాలంలోనే 35 ప్రదేశాల్లో ఈడీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. 25మందిని ప్రశ్నించారు. సీబీఐ నమోదు చేసిన రెండు ఎఫ్?ఐఆర్?లు, హౌసింగ్ బ్యాంక్, సెబీ, నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ , బ్యాంక్ ఆఫ్ బరోడా సమర్పించిన నివేదికల ఆధారంగా సోదాలు నిర్వహించినట్లు ఈడీ అధికారులు తెలిపారు. బ్యాంకులు వాటాదారులు, పెట్టుబడిదారులు, ఇతర ప్రభుత్వ సంస్థలను మోసం చేయడం ద్వారా ప్రజా ధనాన్ని మళ్లించడానికి చేసిన పథకం వేసినట్లు ఈడీ ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని చెప్పారు. ఎస్? బ్యాంక్? ప్రమోటర్?తో సహా బ్యాంకు అధికారులకు లంచాలు ఇవ్వడం వంటి విషయాలు కూడా పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు. 2017-2019 మధ్య కాలంలో ఎస్ బ్యాంకు నుంచి అనధికారికంగా రూ.3వేల కోట్ల రుణాలను ఇతరత్రా మార్గాల్లో మళ్లించారని ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోంది. రుణం మంజూరు చేయడానికి ముందు యాస్ బ్యాంక్ ప్రమోటర్లకు సంబంధిత సంస్థల్లో నిధులు బదిలీ అయినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. 'అనిల్ అంబానీ సంస్థలకు ఎస్ బ్యాంక్ ఇచ్చిన రుణాల్లో క్రెడిట్ అప్రూవల్ మెమోరాండమ్?లను పాతవి. ఎటువంటి ఆర్థిక విశ్లేషణ లేకుండా పెట్టుబడులు ప్రతిపాదించడం బ్యాంక్? క్రెడిట్ పాలసీని ఉల్లఘంటన వంటి విషయాలను ఈడీ గుర్తించింది. ఈ రుణాలను నిబంధనలను విరుద్ధంగా గ్రూప్ సంస్థలు, షెల్ కంపెనీలకు మళ్లించారు' అని ఈడీ వర్గాలు పేర్కొన్నాయి.

**ఈడీ గుర్తించిన విషయాలు**

ఆర్థికంగా బలహీనంగా ఉన్న సంస్థలకు రుణాలు, వాటికి సరైన డాక్యుమెంటేషన్ లేకపోవడం, రుణ గ్రహీతలకి ఒకే చిరునామా, సాధారణ డైరెక్టర్లు, ప్రమోటర్ సంస్థలకు నేరుగా రుణాల మళ్లింపు, జీపీసీ రుణాలను ఎవర్ గ్రీనింగ్ చేయడం, ఒకే రోజున రుణం దరఖాస్తు, మంజూరు, రుణాల మంజూరుకు ముందే డబ్బులు విడుదల, ఆర్థిక వివరాలను తప్పుగా చూపించడం వంటివి ఉన్నాయి.

## బంగాళాఖాతంలో అల్పపీడనం

- ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలు
- అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన సీఎం

**టీ మీడియా, జులై 24, హైదరాబాద్ బ్యూరో :**



ఉత్తర బంగాళాఖాతం మధ్య ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడ ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. గురువారం ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అందుచేత ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, జనగాం, హనుమకొండ, మెదక్, కామారెడ్డి జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని, గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది. ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.ఎలాంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలి : వర్షాల విషయంలో అధికార యంత్రాంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి అప్రమత్తం చేశారు. భారీ వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి, సీఎంవో అధికారులతో మాట్లాడారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని, నీటి ఉధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని, భారీ వర్ష సూచన ఉన్న జిల్లాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎలాంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలకు సాయం చేసేందుకు అధికారులు జిల్లాల్లోనే ఉండాలని ఆదేశించారు.క్రమంగా పెరుగుతోన్న వర్షం : హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. నగరంలో గంటగంటకు వర్షం క్రమంగా పెరుగుతోంది. హుస్సేన్‌సాగర్‌లోకి వరదనీరు భారీగా చేరుతుంది. మరోవైపు రాష్ట్రంలోని జోరు వానలు కొనసాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో తెరిపి లేకుండా మోస్తరు వర్షం కురుస్తోంది. ఆదిలాబాద్‌లో ఉదయం నుంచి ముసురు పట్టడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. హనుమకొండ జిల్లా పరకాలలో నిన్నటి నుంచి కురుస్తున్న వర్షానికి చెరువులు, కుంటల్లోకి భారీగా వాననీరు చేరుతోంది. పరకాల చలివాగు అలుగు పోస్తోంది. పంట పొలాల్లోకి భారీగా వరద చేరుతుండగా పలు చోట్ల పంటలు నీటమునిగాయి.ఎవరూ వాగులు దాటొద్దని అవగాహన : ఏజెన్సీ మండలాల్లోనూ వానలు దంచి కొడుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతుండటంతో పాకాల సరస్సుకు వరద పోటెత్తుతోంది. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని బుర్కపల్లి, కొత్తపెల్లి, రాయితొట్టి వాగులు ఉధృతంగా ప్రవహిస్తూ సరస్సుకు చేరుతున్నాయి. నిన్న రాయితొట్టి వాగులో చేపల వేటకెళ్లి గల్లంతైన నరేశ్ ఆచూకీ ఇంకా దొరక్కపోవడంతో పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అప్రమత్తమైన పోలీసులు చేపల వేటకు వెళ్లిన 20 మంది వలలు స్వాధీనం చేసుకొని కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. వాగులు దాటకుండా ట్రాక్టర్లు అడ్డుపెట్టించి పహరా కాస్తున్నారు. ఎవరూ వాగులు దాటొద్దని అవగాహన కల్పిస్తున్నారు.గ్రామస్థులు ఆవేదన వ్యక్తం : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనూ వానలు కొనసాగుతున్నాయి. వీణవంక మండలం మామిడాలపల్లి వద్ద కొక్కెర కుంటకు గండి పడింది. 'మామిడాలపల్లి-పచ్చునూర్' గ్రామాల మధ్య రోడ్డుపై నుంచి నీరు ప్రవహిస్తోంది. 'జమ్మికుంట-కరీంనగర్' రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. అక్కడ మూడేళ్ల కింద చేపట్టిన బ్రిడ్జ్ పనులు నేటికి పూర్తికావట్లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండల / నియోజక వర్గం /
జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్
ఏజెంట్లు కావలెను
కేంద్రప్రభుత్వ డిజిటల్ మీడియా (2021) గైడ్ లైన్స్‌కి లోబడి నిర్వహణలో ఉన్న జీఎస్టీ లైసెన్స్ కలిగిన టీమీడియా (డిజిటల్) లో పని చేయడానికి మండల / నియోజక వర్గం/ జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను.
అనుభవం ఉన్న వారికీ ప్రాధాన్యత, కొత్త వారికీ అవకాశం కలదు.
వివరాలకు కోసం : 8919710365, 7382990365, 8498972434 కాల్ / మెసెజ్ చేయండి.
GSTIN:36FDKPS1308P1ZX
Spot Speed NEWS
T MEDIA
టి-మీడియా
సామాజికం ... ప్రజల పక్షం...
epaper,www.tmedia.net.in YouTube facebook